జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 14 | జనవరి | 2026 ◆ పేజీలు : 6

## అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా అమలు చేస్తున్నాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- మేడారంలో మరో 200 సంవత్సరాలు నిలిచేలా రాతి నిర్మాణాలతో అభివృద్ధి పనులు
- అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 13, ప్రజాజ్యోతి:** ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రెండు కళ్లలా భావిస్తూ ప్రజా ప్రభుత్వం సమన్వయంతో అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార–పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమమే

మిగతా 2 లో...

- ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలంటూ కొత్త ఒత్తిళ్లు
- గిరిజన, వికలాంగ ఉద్యోగి వెంకటేశ్వర్లుపై కొనసాగుతున్న మానసిక వేధింపులు
- నేతల ఒత్తిడిలతో ఆందోళనలో బాధితుడి కుటుంబం
- రాజీ పేరుతో తిరిగి నేతల మానసిక వేధింపుల ఆరోపణలు
- ఎస్సీ–ఎస్టీ అంశంగా మారిన వ్యవహారం, అయిన స్పందించని ఆ సంఘ నేతలు
- మతి భ్రమించినట్టుగా వ్యవహరిస్తున్న కొందరు యూనియన్ నేతలు
- తప్పు చేసినవారిపై కఠిన చర్యలు తప్పవు: ఏరియా జీఎం




2 లో..

### రాజీకి రావాలంటూ..

# మరో వేధింపు

**సింగరేణి ప్రతినిధి, జనవరి 13, ప్రజాజ్యోతి:** సింగరేణి కొత్తగూడెం ఏరియా స్టోర్ లో గిరిజన, వికలాంగ ఉద్యోగి లకావత్ వెంకటేశ్వర్లపై జరుగుతున్న వేధింపుల వ్యవహారం మరింత తీవ్రతరమవుతున్నట్టు తెలుస్తోంది. జనరల్ అసిస్టెంట్ దోనబోయిన శ్రీనివాస్ పై ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీకి చెందిన కొందరు నేతలు వెంకటేశ్వర్లపై ముమ్మరంగా ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. ఇంతకుముందు కార్యాలయంలోనే మానసిక వేధింపులు, నోటి దురుసు ప్రవర్తన, బెదిరింపులు ఎదుర్కొన్న వెంకటేశ్వర్లు, వాటిపై ఎస్సీ – ఎస్టీ లైజనింగ్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ ఫిర్యాదుతో వ్యవహారం ముగిసిందని భావించిన వేళ, ఇప్పుడు అదే సంఘానికి చెందిన కొందరు నేతలు మరో రూపంలో వేధింపులకు పాల్పడుతున్నారని బాధితుడి సన్నిహితులు చెబుతున్నారు. ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని

మిగతా 2 లో...



ఫోటో ఫ్రేమ్ లోని ప్రత్యేక కథనం యొక్క అంశాలను పత్రిక ప్రతినిధి అశోక్ వివరించగా, ఆసక్తిగా వింటూ ఆనందంగా తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

# ప్రజా సమస్యలకు స్వరం.... ప్రజాజ్యోతి

### ప్రజాజ్యోతి క్యాలెండర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

### కలెక్టర్ కు ఫోటో ఫ్రేమ్ జ్ఞాపిక అందించిన పత్రిక బృందం

**కొత్తగూడెం, జనవరి 13 (ప్రజాజ్యోతి):** ప్రజాజ్యోతి దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాజ్యోతి పత్రిక ప్రజల సమస్యలను నిజాయితీగా, ధైర్యంగా వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి దిశానిర్దేశం చేస్తోందని ప్రశంసించారు. ప్రస్తుత కాలంలో ప్రజా సమస్యలకు ఓ స్వరంలా ఈ పత్రిక పనిచేస్తోందని అభిప్రాయపడ్డారు. పరిపాలనలో ఎదురయ్యే వాస్తవ సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లే బాధ్యతాయుత జర్నలిజం సమాజ మార్పుకు కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత సమాజ మార్పులో ముందుండాలని, అవగాహనతో చైతన్యవంతులుగా ఎదగాలని సూచించారు. అనంతరం జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం కలెక్టర్ చేస్తున్న కృషిని ప్రతిబింబించేలా ప్రజాజ్యోతి ప్రచురించిన ప్రత్యేక కథనాన్ని ఫోటో ఫ్రేమ్ గా ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి మాలోత్ అశోక్, బృందం కలెక్టర్ కు జ్ఞాపికగా అందించారు. ఆ ఫ్రేమ్ ను పరిశీలించిన కలెక్టర్ ఒక్కసారిగా ఆనందం వ్యక్తం చేస్తూ, "చాలా గొప్పగా ఉంది" అంటూ ప్రజాజ్యోతి బృందాన్ని అభినందించారు. అలాగే జిల్లాలో వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలు, అలాగే నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, ఉపాధి అవకాశాలు కల్పించే అంశాలపై కూడా లోతైన అవగాహనతో కథనాలు ప్రచురించాలని కలెక్టర్ సూచించారు. ప్రజాజ్యోతి కథనాలు జిల్లా ప్రజల్లో, ముఖ్యంగా యువతలో చైతన్యం తీసుకువచ్చేలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పత్రిక బృందం వీరభద్రం, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు. ప్రజాజ్యోతి క్యాలెండర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్. కలెక్టర్ కు ఫోటో ఫ్రేమ్ జ్ఞాపిక అందించిన ప్రజా జ్యోతి బృందం

### అశ్వారావుపేట–దమ్మపేటకు

# అభివృద్ధి జోష్

- రూ.20 కోట్లతో మౌలిక వసతులకు శ్రీకారం
- సెంట్రల్ లైటింగ్ తో దమ్మపేటకు కొత్త వెలుగు



**దమ్మపేట, జనవరి 13, (ప్రజాజ్యోతి):** అ శ్వారావుపేట , దమ్మపేట మండల కేంద్రాల రూపురేఖలు మారనున్నాయి. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్లతో పాటు

మిగతా 2 లో...

## ఏరైవ్ - ఎలైవ్ కార్యక్రమం

- రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం
- జిల్లా వ్యాప్తంగా పది రోజుల పాటు రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమాలు
- ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి : ఎస్పీ రోహిత్ రాజు

**సుజాత నగర్ (ప్రజాజ్యోతి ) జనవరి 13:** సుజాతనగర్ మండలం లో మంగళవారం తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్ వారు రోడ్ సేఫ్టీ పై ప్రవేశపెట్టిన "ఏరైవ్ – ఎలైవ్ " కార్యక్రమం సుజాత నగర్ గ్రామంలో రోడ్ సేఫ్టీ పై సుజాత నగర్ పోలీసు వారు అవగాహన

మిగతా 2 లో...



## ఏరైవ్ - ఎలైవ్ కార్యక్రమం



(మొదటి పేజీ తరువాయి...)

కార్యక్రమం నిర్వహించారు . ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏరైవ్ – ఎలైవ్ కార్యక్రమం ప్రారంభోత్సవం జరిగింది.రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు,రవాణా,ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేసిన వినూత్న కార్యక్రమమే ఏరైవ్ – ఎలైవ్–2026 అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఏరైవ్ – ఎలైవ్ కార్యక్రమాన్ని జిల్లాలో మంగళవారం నాడు సుజాతనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుజాతనగర్ మండల పరిసర ప్రాంతాల ప్రజలు,ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు.రోడ్డుపై విధులలో పోలీసులు ఉన్నా,లేకపోయినా వాహనాలను నడిపేటప్పుడు నియమ,నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని కోరారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి తమ ప్రాణ భద్రతతో పాటు,ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్ ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,ఓవర్ లోడ్,మైనర్ పిల్లలు డ్రైవింగ్ చేయడం,సీట్ బెల్ట్ ధరించడం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు . డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ తమ వాహనానికి ఇన్సూరెన్స్ కలిగి ఉండటం డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండవలసిన ఆవశ్యకతను తెలియజేశారు.అనంతరం సుజాతనగర్ పరిధిలో రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులు వారి ప్రస్తుత పరిస్థితిని అక్కడ పాల్గొన్న ప్రజలకు వివరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు రోడ్డు భద్రతా నియమాల ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,ట్రైనీ ఆర్డీఓ మురళి,జిల్లా రవాణాధికారి భూషితా రెడ్డి, ఆర్టీసి డిఎం రాజ్యలక్ష్మి,ఎంఆర్ఓ కృష్ణ,మోటారు వాహనాల అధికారులు వెంకట రమణ,వెంకట పుల్లయ్య,వైద్యారోగ్య శాఖ అధికారులు, సీఐలు ప్రతాప్,శ్రీలక్ష్మి,వెంకటేశ్వర్లు,సుజాతనగర్ ఎస్సై రమాదేవి, ఎస్సైలు రమణారెడ్డి,ప్రవీణ్,రవి తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట–దమ్మపేటకు అభివృద్ధి జోష్

(మొదటి పేజీ తరువాయి...)

దమ్మపేటలో సెంట్రల్ లైటింగ్ కు రూ.5 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అశ్వారావుపేట, దమ్మపేట మండల కేంద్రాల్లో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార–పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు శ్రీ రామ సహాయం రఘురాం రెడ్డి, టీపీసీసీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్, అశ్వారావుపేట శాసనసభ్యులు శ్రీ జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. నూతన మున్సిపాలిటీ భవనం, మార్కెట్ భవనాల సముదాయం, ప్రజా మరుగుదొడ్లు, సీసీ రహదారులు, సీసీ డ్రైనేజీలు, దొంతికుంట చెరువు సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. అలాగే సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న రంగవల్లి పోటీలను ప్రారంభించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. తదుపరి దమ్మపేట మండలం మందలపల్లి నుంచి దమ్మపేట వరకు రూ.5 కోట్లకు పైగా నిధులతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ లైటింగ్ వ్యవస్థతో రాత్రి వేళల్లో రహదారి భద్రత మెరుగుపడడంతో పాటు పట్టణానికి మరింత శోభ చేకూరనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజీకి రావాలంటూ.. మరో వేధింపు

(మొదటి పేజీ తరువాయి...)

దీనికి రాజకీయ రంగు ఉందని చెప్పాలని, లేకపోతే పరిణామాలు మంచిగా ఉండవన్న సంకేతాలు ఇస్తూ ఒత్తిడి తెస్తున్నారని తెలుస్తోంది. “ఇది మా యూనియన్ పరువుకు భంగం”, “ఇక్కడితో రాజీ చేసుకుంటే నీకే మంచిది” అంటూ ఒకవైపు లాలిస్తూ, మరోవైపు పరోక్షంగా భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. అయితే 58 ఏళ్ల వయస్సు గల, గిరిజన వర్గానికి చెందిన వికలాంగ ఉద్యోగి అయిన వెంకటేశ్వర్లు మాత్రం ఈ ఒత్తిడులకు లొంగడం లేదని తెలుస్తోంది. “నా మీద జరిగినది అన్యాయం. నేను నిజం చెప్పాను. నా ప్రాణాలు పోయినా పర్వాలేదు కానీ అసత్యానికి ఒప్పుకోను. ఫిర్యాదు వెనక్కి తీసుకునేది లేదు” అంటూ ఆయన తెగించి చెప్పినట్టు సన్నిహితులు తెలిపారు. అయితే ఈ వ్యవహారంలో మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. వేధింపులకు గురైన ఉద్యోగిని రక్షించాల్సిన యూనియన్ వర్గాల నుంచే తిరిగి ఈ ఒత్తిళ్లు కొనసాగుతుండటం. కార్మిక హక్కుల కోసం పోరాటం చేయాల్సిన గుర్తింపు సంఘం పై ఈ రకమైన ప్రవర్తన ఆరోపణలు రావడం సింగరేణి కార్మిక వర్గాల్లో తీవ్ర ఆవేదనకు దారి తీస్తోంది. ఇదే సమయంలో ఈ అంశంపై యూనియన్ అధిష్టానం ఇప్పటివరకు బహిరంగంగా స్పందించకపోవడం కూడా అనేక ప్రశ్నలకు తావిస్తోంది. కొందరు నేతల ప్రవర్తన వల్ల సంఘ ప్రతిష్ఠ దెబ్బతింటున్నా మౌనం పాటించడం, కార్మికుల్లో నమ్మక సంక్షోభాన్ని పెంచుతోందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వ్యవహారం పై సింగరేణి యాజమాన్యం మాత్రం తేలికగా తీసుకోవడం లేదని సమాచారం. ఏరియా స్థాయి ఉన్నతాధికారులు ఈ పరిణామాలపై సీరియస్ గా స్పందిస్తున్నట్టు తెలుస్తోంది. ఒక గిరిజన, వికలాంగ ఉద్యోగిని ఫిర్యాదు చేసినందుకు మరింత ఒత్తిడికి గురిచేయడం చట్టపరంగా, నైతికంగా అత్యంత తీవ్రమైన అంశమని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. వెంకటేశ్వర్లు మొదట ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎవరు ఉన్నా సరే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆ సంఘానికి సంబంధించిన కొన్ని అంశాల్లో హద్దులు దాటిన ప్రవర్తనపై మౌఖిక హెచ్చరికలు ఇచ్చినా మార్పు కనిపించకపోవడంపై అధికారుల్లో అసంతృప్తి ఉన్నట్టు సమాచారం. ఈసారి మాత్రం ఈ వ్యవహారాన్ని ఇక్కడితోనే కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వాళ్ళలో బలపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో సింగరేణి కార్మిక వర్గాల్లో ఒకే ప్రశ్న వినిపిస్తోంది. ఫిర్యాదు చేయడమే తప్పైతే...న్యాయం కోరే ధైర్యం ఎవరికుంటుంది? హక్కుల కోసం ఏర్పడిన సంఘాలే ఒత్తిడికి మారితే... కార్మికుడు ఎవరిని ఆశ్రయించాలి? అని. అయితే ఇక పై ఈ కేసు ఎటు దారి తీస్తుందన్నది, యాజమాన్యం మరియు ఎస్సీ – ఎస్టీ అధికారులు తీసుకునే చర్యలపై ఆధారపడి ఉందని కార్మిక వర్గాలు అంటున్నాయి. అయితే ఎస్సీ–ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగిపై ఈ స్థాయిలో వేధింపులు జరుగుతున్నా, అదే వర్గానికి చెందిన నాయకులు ఇప్పటివరకు స్పందించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. బాధితుడి పక్షాన నిలవాల్సిన వేళ మౌనం పాటించడం, వారి నైతిక బాధ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

## చర్యలు తీసుకుంటాం : షాలెంరాజు (కొత్తగూడెం ఏరియా జీఎం)




“లకావత్ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ వ్యవహారంపై ఇప్పటికే విచారణ జరిపాం. సంబంధిత అంశాలన్నింటిని పరిశీలించాం. ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. తప్పు చేసినవారు ఎవరు అయినా సరే, నిబంధనల ప్రకారం కచ్చితంగా గట్టి చర్యలు తీసుకుంటాం. గిరిజన, వికలాంగ ఉద్యోగిపై ఈ తరహా వేధింపులు జరగడం మేము అసలు సహించం. ఉద్యోగుల భద్రత, గౌరవం యాజమాన్యానికి చాలా ముఖ్యం. ఇక్కడి నిభందనలు అందరికీ ఒకటే. ఎవరికీ మినహాయింపు లేదు.”

## అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా అమలు చేస్తున్నాం ..

(మొదటి పేజీ తరువాయి...)

ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో మంత్రి పొంగులేటి , ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ లతో కలిసి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో నగరాభివృద్ధి నిధుల ద్వారా రూ.1 కోటి 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న మున్సిపల్ మార్కెట్ భవనం, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా నగరాభివృద్ధి నిధుల ద్వారా రూ.7 కోట్ల వ్యయంతో మంజూరైన అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం దమ్మపేట గ్రామంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతి పేదవాడికి అండగా నిలుస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో అమలు చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాన ప్రాధాన్యతతో అమలు చేస్తూ ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. సమ్మక్క–సారలమ్మ మహాజాతర ఈ నెల 28, 29, 30, 31 తేదీలలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇది ఆదివాసీల అతిపెద్ద ఆధ్యాత్మిక జాతరగా మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు మేడారానికి తరలివచ్చే మహోత్సవమని అన్నారు, ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా, కాకతీయుల కాలం నాటి నిర్మాణ శైలిని తలపించేలా రాతి నిర్మాణ పద్ధతిలో మరో 200 సంవత్సరాలు నిలిచే విధంగా మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం పర్యటనకు రానున్నారని, 19న మేడారం పునరుద్ధరణ, అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. గత రెండు సంవత్సరాల కాలంలో ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చుతూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుందని మంత్రి తెలిపారు. దాని ఫలితంగానే ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 శాతం స్థానాల్లో ప్రజలు ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ఇదే విశ్వాసంతో రానున్న ఎన్నికలలో కూడా ప్రజలు ప్రజా ప్రభుత్వానికే మద్దతు ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ మువ్వ విజయ్ బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిష్పక్షపాతంగా వార్తలు "ప్రజాజ్యోతి" కే సాధ్యం

**ఇల్లందు, జనవరి 13, ప్రజాజ్యోతి:** సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని నిష్పక్షపాతంగా వార్తల రూపంలో ప్రజలకు చేరవేసేది కేవలం "ప్రజాజ్యోతి" మాత్రమేనని ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ప్రజాజ్యోతి దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను సీఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా రంగం ఉంటుందన్నారు. సమాజంలో జరిగే మంచి, చెడులను ప్రపంచానికి తెలియజేసే సత్తా మీడియా రంగానికే ఉంటుందన్నారు. వివిధ రంగాల్లో జరుగుతున్న అవకతవకలపై మీడియా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా, ఆదిశగా పాత్రికేయులు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హసీనా, ప్రజాజ్యోతి ఇల్లందు అర్సీ ఇంచార్జ్ బత్తుల రాధాకృష్ణ, టౌన్ రిపోర్టర్ చాంద్ పాషా, పాత్రికేయులు సరికొండ ప్రసాద్, మాటేటి మధుబాబు, పాశం రాకేష్, గుగులోత్ రాజేష్, గౌరీశెట్టి విజ్ఞాన్, చీకుర్తి కుమార్, చేని శివ, కోర్లపాటి కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మత్తులో... "ముంచుతున్నారు"

- బీభత్సంగా బెల్ట్ దందా..!
- అక్రమ మద్యం అమ్మకాలకు... అధికారుల సమ్మతమేనా..?
- సిండికేట్ కు సమ్మతించని రెండు షాపులు..?



**బూర్గంపహాడ్ జనవరి 13 (ప్రజా జ్యోతి):** వడ్డించేవాడు మనవాడైతే ఏబంతిలో కూర్చుంటే ఏంది..! అన్న చందంగా బూర్గంపహాడ్ మండలంలోని బెల్ట్ షాపుల దందా కొనసాగుతుందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకాడుతున్నారంటే కారణం ఏమై ఉండవచ్చు..? అనే సందేహం బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా వ్యక్తం అవుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల పరిధిలోని పలు పంచాయతీలలో బెల్ట్ షాపుల నిర్వహణ మూడు పువ్వులు ఆరు కాయలుగా రోజురోజుకి వృద్ధి చెందుతుంది. ఇటీవల ఏర్పాటైన వైన్ షాపుల నిర్వాహకులు బెల్ట్ షాపులకు మద్యం సప్లై చేయడంలో ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఎక్కువగా అమ్ముడుపోయే బ్రాండ్ మద్యంను అధిక రేటుకు బెల్ట్ షాపులకు సప్లై చేసి ధనార్జన ధ్యేయంగా వైన్ షాపులను నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. అయితే మండల పరిధిలోని దాదాపుగా అన్ని పంచాయతీల్లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులు ఈ ఆరోపణలకు తీవ్రమైన బలాన్ని చేకూరుస్తున్నాయి. ఎమ్మార్పీ రేట్లకు అమ్మవలసిన మద్యాన్ని అధిక రేట్లకు బెల్ట్ షాపులకు అమ్ముతూ... బెల్ట్ షాపు నిర్వాహకులు మరింత రేటును పెంచి మద్యం ప్రియులను మత్తులోనే నిండా ముంచుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**– బీభత్సంగా బెల్ట్ దందా..!**

మండల వ్యాప్తంగా అనేక బెల్ట్ షాపుల దందా బీభత్సంగా జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు అనే సందేహాలకు... వాళ్లు ఏం చేస్తారు.. చూసి చూడనట్లు వ్యవహరిస్తారు...! అని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. అధికారులే కట్టడి చేయాలి అనుకుంటే బెల్ట్ షాపులు ఈ విధంగా నడుస్తాయా..! అని స్థానికులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్టు షాపుల్లో ఇటీవల గొడవలు చోటు చేసుకున్న సందర్భాలు లేకపోలేదు. జేబులు నింపుకునేందుకు, అక్రమ సంపాదనకు ఆశపడి వైన్ షాప్ యాజమాన్యాలు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతుంటే అధికారుల చర్యలు ఎక్కడున్నాయని..?

**– సిండికేట్ కు సమ్మతించని ఆ రెండు షాపులు..?**

మండల వ్యాప్తంగా ఇటీవల ఏర్పడిన మద్యం దుకాణదారులలో సమన్వయం కనిపించట్లేదని పలువురు చర్చించుకుంటున్నారు. మండలంలోని ఐదు షాపులలో సిండికేట్ మూడు షాపుల యజమానులు ఏకగ్రీవం కాగా మరో రెండు షాపులు మాత్రం సిండికేటును వ్యతిరేకిస్తూ తమ వ్యాపారానికి సిండికేట్ తో అవసరం లేదంటున్నట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో సిండికేట్ గా ఏర్పడిన యజమానులు బెల్ట్ షాపులకు అధిక ధరలతో బెల్ట్ షాపులకు స్వయంగా వారే ఆటోల ద్వారా డెలివరీ చేస్తున్నట్లు వినికిడి. మండలంలో ఇంత దారుణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత ఎక్సైజ్ శాఖ మామూళ్ల మత్తులో చేతులు కట్టుకొని చూచి చూడనట్లు వ్యవహరించడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బెల్ట్ షాపుల నిర్వహణను కట్టడి చేసి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముక్తకంఠంతో కోరుతున్నారు.

## అక్రమంగా డబ్బులు వసూలు సరికాదు



**ఇల్లందు, జనవరి 13, ప్రజాజ్యోతి:** పట్టణంలోని ఓ పాఠశాల యాజమాన్యం వార్షికోత్సవాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం సరికాదని తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ, తెలుగునాడు విద్యార్థి సమైక్య నాయకులు, సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, దాసరి గోపాల కృష్ణలు ఆరోపించారు. మంగళవారం స్థానిక విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 2న నిర్వహించిన వార్షికోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఒక్కో విద్యార్థి నుంచి రూ. 1000 నుంచి 2000 వరకు వసూలు చేసి సుమారుగా రూ.20 లక్షల రూ. 30 లక్షల వరకు సమీకరించినట్లు విమర్శించారు. అదేవిదంగా ఈ వార్షికోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనాలంటే తప్పనిసరిగా డబ్బులు చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేసి, కాస్ట్యూమ్స్, డాన్స్ కొరియోగ్రఫీ, ఇతర ఖర్చుల పేరుతో పెద్ద మొత్తంలో వసూళ్లు చేశారని, అలాగే ఇచ్చిన కాస్ట్యూమ్స్ కూడా వెనక్కి తీసుకున్నారని, మానసికంగా వేధించిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. సాయంత్రం నాలుగు గంటలకు వార్షికోత్సవ కార్యక్రమం అర్ధరాత్రి ఒంటిగంట వరకు నిర్వహించి పిల్లలకు తల్లిదండ్రులకు చలిలో ఎలాంటి సదుపాయాలు కల్పించకుండా మొక్కుబడిగా లడ్డు, మిక్చర్ పొట్లాలు పంచడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వ విద్యా నిబంధనలకు విరుద్ధమని, ఇదే పాఠశాల గతంలోనూ ఇలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం ఉందని తెలిపారు. ఈ ఘటనపై తక్షణ విచారణ చేపట్టి సంబంధిత పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి అక్రమ వసూళ్లు జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే పాఠశాల గుర్తింపును కూడా పరిశీలించాలని కోరారు.

## ముగిసిన ప్రత్యేక శీతాకాల శిబిరం



**ఇల్లందు టౌన్, జనవరి 13, ప్రజాజ్యోతి:** ఇల్లందు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తోర్తి జాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 7 రోజుల ప్రత్యేక శీతాకాల శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ సేవ చేయడం ద్వారా సమాజం మారుతుందని, సేవ నేర్చుకోవడం ద్వారా యువత భవిష్యత్తు మారుతుందనే నినాదంతో నిర్వహించిన ఈ శిబిరం యువతలో సేవా భావాన్ని మరింత బలపరిచిందని పేర్కొన్నారు. చిన్న వయసులోనే సేవాభావం అలవడితే, పెద్దయ్యాక మరింత బాధ్యతాయుతమైన కార్యక్రమాలు చేపట్టగలుగుతారని తెలిపారు. సమాజ హితానికి అంకితమైన ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు హనుమంతులపాడు యువతలో మంచి మార్పుకు నాంది పలుకుతాయన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించిన కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని కొనియాడారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ, ఎయిడ్స్ అవగాహన ర్యాలీ, డ్రంక్ అండ్ డ్రైవ్, సైబర్ నేరాలు, మూఢనమ్మకాల నివారణ, పరిశుభ్రత కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడంపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వర, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్, ఎన్ఎన్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తొర్తి జాన్, ఎన్ హెచ్ ఆర్సి ఉమెన్ అండ్ చైల్డ్ ఎన్ఫోర్స్మెంట్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా చైర్మన్ యండి. మొహిద్దిన్, హాజర్ల రాధా గోవిందు, రాష్ట్ర అధ్యక్షులు ఎం. నాగేశ్వరరావు (జనరల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం జిల్లా హెచ్ఎన్హెచ్ఆర్సి భూపాల్, భద్రాద్రి జిల్లా ఇన్చార్జ్ (ఎన్ హెచ్ఆర్సీ) సిద్ధు, ఎం. నాగేశ్వరరావు, గ్రామ ప్రజలు లక్ష్మీనారాయణ, మురళీకృష్ణ, హనుమంతు, వెంకట్, వెంకటేష్, అశోక్, నాగేశ్వరరావు, పాపమ్మ, ప్రశాంత్, శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## మృతులా కుటుంబాలకు అండగా బీఆర్ఎస్ బియ్యం వితరణ చేసిన నాయకులు



**టేకులపల్లి,జనవరి13,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బోడు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో పలువురు మృతి చెందిన కుటుంబాలకు బిఆర్ఎస్ నాయకులు అండగా నిలిచి ప్రతి ఒక కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని మంగళవారం వితరణ చేశారు. మురికి లాలయ్య కుటుంబానికి 50 కేజీల బియ్యాం, కుంపటి సరోజినమ్మ ఇప్పుడు మనకి 50 కేజీలు బియ్యం,బోడు కొత్తగూడెం కొండ్రు అశోక్ కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ అమ్మకంలో మొదటి స్థానంలో నిలిచినా పాల్వంచ ఎల్పిజి సెంటర్



**కొత్తగూడెం, జనవరి 13(ప్రజాజ్యోతి):** హెచ్ పిసిఎల్ కంపెనీ విజయవాడ రీజినల్ కార్యలయం రీజినల్ ఆధ్వర్యంలో రీజినల్ మేనేజర్ పంకాజ్ చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ పి జి డిస్ట్రిబ్యూటర్స్ సమీక్షా సమావేశంలో ఎల్ పి జి డిస్ట్రిబ్యూషన్ అన్ని విభగాల్లో రీజినల్ పరిధిలో బెస్ట్ డోమెస్టిక్ సిలిండర్స్ సేల్స్ చేసినాందుకు గాను పాల్వంచ ఎల్ పి జి సెంటర్ మేనేజర్ ఆనంతుల లక్ష్మి నారాయణ కి రీజినల్ మేనేజర్ పంకజ్ చౌదురి, డి. జి. యం. రాహుల్ సింఘ్, ఏరియా సేల్స్ మేనేజర్ పవన్ నరేష్ నుండి ఉత్తమ ప్రతిభ కనపరచ్చినందుకు అవార్డు అందుకున్నా లక్ష్మినారాయణ.ఎల్ పి జి సెంటర్ పాల్వంచ మేనేజర్ లక్ష్మి నారాయణ నీ పంకాజ్ చౌదరి ప్రత్యేకించి అభినందించారు. రీజినల్ పరిధిలో ఒక ప్రభుత్వ అధికారి ఉత్తమ అవార్డు దక్కించుకోవడం చాలా ఆరుదని తెలిపారు. అదేవిధంగా మిగతా డిస్ట్రిబ్యూటట్స్ నీ పాల్వంచ ఎల్ పి జి సెంటర్ నీ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.రీజినల్ పరిధిలో ఇంతా కంపిటిషన్ వున్నా డిస్ట్రిబ్యూటర్స్ లో మన భద్రాద్రి జిల్లా పాల్వంచ ఎల్ పి జి సెంటర్ కి ఉత్తమ అవార్డు రావడం తో మేనేజర్ ఆనంతుల లక్ష్మీనారాయణ ప్రత్యేకించి అభినందించిన జిల్లా కలెక్టర్ జీతేష్ వి పాటిల్,సంయుక్త కలెక్టర్ వేణుగోపాల్.సివిల్ సప్లయ్స్ జిల్లా అధికారి ఎస్.త్రినాధ్ బాబు,జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జితేష్వి పాటిల్ నుండి హెచ్పిసిఎల్ ఉత్తమ అవార్డు నీ తీసుకున్న లక్ష్మినారాయణ. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..గ్యాస్ వినియోగదారులకు సకాలం లో సరఫరా అయ్యేటట్లు, గ్యాస్ వల్ల ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు ఎప్పటికప్పుడు తెలిసేలా చర్యలు తీసుకొవ్వాలని తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్యాస్ వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సరఫరా చేస్తూ ఇలాంటి ఉత్తమ అవార్డులు, పురస్కారాలు హెచ్పిసియల్ వారినుండి తీసుకోవాలని తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో డి. సి. యస్. ఓ. ప్రవీణ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ త్రినాద్ బాబు,హెచ్ పి గ్యాస్ మేనేజర్, ఆనంతుల లక్ష్మీనారాయణ, కంప్యూటరు ఆపేరేటర్లు రజిత, నరేష్ మరియు మెకానిక్ ప్రకాష్ పాల్గొన్నారు.



## మావోయిస్టుల డంప్ స్వాధీనం



**చర్ల, జనవరి 13: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ లో సీనియర్ అధికారుల ఆదేశాల మేరకు, నక్సల్ రహిత, శాంతియుతమైన అభివృద్ధి చెందిన బస్తర్ కలను సాకారం చేయడానికి నారాయణపూర్ పోలీసులు ఈ ప్రాంతంలో నిర్ణయాత్మకమైన నక్సల్ వ్యతిరేక ప్రచారం "మాడ్ బచావో" యొక్క చివరి దశను నిరంతరం నిర్వహిస్తున్నారు. గ్రామస్తుల నుండి వచ్చిన సమాచారం ఆధారంగా శనివారం, డి ఆర్ జి , ఐ టి బి పీ సంయుక్త బృందం కోహ్కామెట పోలీస్ స్టేషన్ పరిధిలోని మండోడా న్యూ సెక్యూరిటీ అండ్ పబ్లిక్ కన్వీనియన్స్ క్యాంప్ లోపలి పర్వత ప్రాంతాల నుండి భారీ మొత్తంలో నక్సల్ డంప్‌ను స్వాధీనం బలగాలు చేసుకుంది.

**స్వాధీనం చేసుకున్న నక్సల్ డంప్:**

పెద్ద బాణం బాంబు – 94 ముక్కలు , చిన్న బాణం బాంబు – 70 ముక్కలు , భార్మర్ తుపాకీ – 03 ముక్కలు , ఇనుప పైపు – 15 ముక్కలు , సిరంజి – 17 ప్యాకెట్లు , బ్యాండేజ్ – 3 ప్యాకెట్లు , విటమిన్ టాబ్లెట్ – 6 స్ట్రిప్లు, నిమెసులైడ్ & పారాసెటమాల్ టాబ్లెట్ – 46 స్ట్రిప్లు , క్రోమోస్టాట్ ఇంజెక్షన్ – 10 ముక్కలు , గ్లూకోజ్ – 02 సీసాలు , డిఫెన్‌పార్ – 01 స్ట్రిప్ , ఆక్సి ల్యాబ్ – 01 పీస్ , లిగ్నోకలైన్ & అడ్రినలిన్ – 01 పీస్ , కాస్టర్–ఎన్ఎఫ్ – 06 పీస్‌లు , ప్రాపోడిన్–ప్లస్– 01 పీస్ , టాక్సిమ్ – 24 పీస్‌లు లను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. నారాయణపూర్ జిల్లాలో అధికారులు గ్రామస్తులను నిరంతరం కలుసుకుని వారికి ప్రభుత్వ పథకాలు ప్రయోజనాల గురించి తెలియజేస్తున్నారు. దీనితో పాటు ప్రజలతో సమన్వయాన్ని ఏర్పరచడం ద్వారా, నక్సల్ డంప్‌లు, నక్సల్ మద్దతు ఉన్న వ్యక్తులు నక్సల్ కార్యకలాపాల గురించి సమాచారాన్ని సేకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా, పోలీసులు పరిపాలన మధ్య ఉమ్మడి ప్రయత్నం నియాద నెల్లనార్ పథకం కింద పోలీసు శిబిరాల చుట్టూ ఉన్న గ్రామాలను అనుసంధానిస్తోంది నివాసితులకు ప్రశాంతమైన, సురక్షితముగా గ్రామాలలో నివసించే అవకాశాన్ని కల్పిస్తోంది. విద్యుత్, తాగునీరు, రోడ్లు, అంగన్‌వాడీలు, పాఠశాలలు, రేషన్ దుకాణాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వంటి ప్రాథమిక అవసరాలు గ్రామాల్లో తీర్చబడుతున్నాయి.

## రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం

- ట్రాఫిక్ నియమాలు అందరూ పాటించాలి - చర్ల సీఐ రాజు వర్మ




**చర్ల, జనవరి 13: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్ వారు రోడ్ సేఫ్టీ పై ప్రవేశపెట్టిన "ఎరైవ్ – ఎలైవ్ " కార్యక్రమం సుబ్బంపేట గ్రామంలో రోడ్ సేఫ్టీ పై చర్ల పోలీసు వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భగా చర్ల సి ఐ రాజు వర్మ మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తూ అందరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని , హెల్మెట్ ధరించడం, డ్రంక్ అండ్ డ్రైవ్, త్రిబుల్ రైడింగ్, మైనర్ పిల్లలు డ్రైవింగ్ చేయడం,సీట్ బెల్ట్ ధరించడం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు . డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ తమ వాహనానికి ఇన్సూరెన్స్ కలిగి ఉండటం డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండవలసిన ఆవశ్యకతను తెలియజేశారు.ఈ కార్యక్రమం లో చర్ల సి ఐ రాజు వర్మ ,ఎస్ ఐ లు నర్సిరెడ్డి ,కేశవ్ , పోలీస్ సిబ్బంది , సుబ్బంపేట సర్పంచ్ , వార్డ్ మెంబర్లు పంచాయతీ సెక్రెటరీ ,గ్రామ ప్రజలు,యువత పాల్గొన్నారు .

## సి.ఐ.డి.పి వ్యాధితో బాధపడుతున్న మహిళకు లయన్స్ క్లబ్ ఆర్థిక సహాయం



**భద్రాచలం ,జనవరి13,ప్రజాజ్యోతి :** లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం శ్రీరామ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు గ్రామానికి చెందిన వలదాసు వెంకటమ్మ సిఐడిపి వ్యాధితో గత తొమ్మిది నెలలుగా హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకున్న లయన్స్ క్లబ్ సభ్యులు ఆమె కుటుంబానికి చేయూతగా నిలిచారు. ఈ సందర్భంగా బాధితురాలి భర్త సోమయ్యకు వైద్య ఖర్చుల నిమిత్తం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం శ్రీరామ క్లబ్ అధ్యక్షులు చల్ల గుళ్ల నాగేశ్వర రావు కోశాధికారి భరత్ కుమార్ సభ్యులు సిద్ధారెడ్డి నరసింహాచారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రజాజ్యోతి క్యాలెండర్ ఆవిష్కరణ

**చర్ల, జనవరి 13: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం ప్రజా జ్యోతి దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ని పలు ప్రభుత్వ కార్యాలయ అధికారులు మండల ఎమ్మార్వో ఏం .శ్రీనివాస్ , చర్ల సిఐ రాజు వర్మ ,ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ్ లు , మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు ప్రజా జ్యోతి దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికలు సమాజంలో నాలుగో స్తంభంగా ఉంటూ అధికారులకు ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ నిజాలు రాస్తూ ప్రజా సమస్యల పైన నిరంతరం పరిష్కరించే విధంగా పాటుపడాలని ప్రజా సమస్యలను మీ కలంతో రాసినప్పుడే మా దృష్టికి రాని సమస్యలు వస్తాయని అవి చూసినప్పుడు ప్రభుత్వ అధికారుల ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు . నిరంతరం ప్రజా సమస్యల పైన ప్రజల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ నేటి సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ ప్రజలకు ఉపయోగపడేలాగా వార్తా కథనాలను రాయాలని మండల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు . ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది , చర్ల ప్రజా జ్యోతి రిపోర్టర్ టి. రాజేష్ కుమార్, మండల పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.








## రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

- హెల్మెట్–సీటుబెల్ట్ తోనే సురక్షిత ప్రయాణం...దమ్మపేట పోలీస్



**దమ్మపేట,జనవరి. 13,(ప్రజా జ్యోతి ):** రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ప్రజలు సురక్షితంగా ప్రయాణించి క్షేమంగా తమ కుటుంబాల వద్దకు చేరుకోవాలనే సందేశాన్ని ప్రజలకు చేరవేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, కొత్తగూడెం జిల్లా పోలీసు అధికారి ఆదేశాల మేరకు దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో దమ్మపేట మండలం, ముస్టిబండ గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ నాగరాజు, ఎస్ఐ బి. సాయి కిషోర్ రెడ్డి గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్ వయస్సులో వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను గతంలో ఈ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను ఉదాహరణగా చూపుతూ వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు .అనంతరం గ్రామస్తులందరితో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమాజాన్ని మార్చే బలమైన ఆయుధం "ప్రజాజ్యోతి"

- ప్రజా సమస్యలలో "ప్రజాజ్యోతి" పాత్ర కీలకం
- ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పత్రిక పనిచేయాలి
- టేకులపల్లి సీఐ, ఎమ్మార్వో






**టేకులపల్లి, జనవరి13, ప్రజాజ్యోతి:** సమాజాన్ని మార్చే బలమైన ఆయుధం "ప్రజాజ్యోతి" అని, ప్రజా సమస్యలలో "ప్రజాజ్యోతి" పాత్ర కీలకమని టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, తహాసిల్దార్ వీరభద్రంలు అన్నారు. మంగళవారం సీఐ, తహసీల్దార్ చేతుల మీదుగా ప్రజాజ్యోతి జాతీయ తెలుగు దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పత్రిక పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో ప్రజాజ్యోతి పత్రిక పాత్ర కీలకమని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్,ఎం. అనిల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా ట్రైబల్ మ్యూజియం రూపకల్పన అభినందనీయం

♦ ఆస్ట్రేలియా పర్యాటకురాలు రాబిన్ జెపరి ప్రశంసలు







**భద్రాచలం ,జనవరి 13,ప్రజాజ్యోతి :** గిరిజనుల జీవనశైలి, సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు పర్యాటకులకు స్పష్టంగా ప్రతిబింబించేలా ఆకట్టుకునే విధంగా ట్రైబల్ మ్యూజియాన్ని రూపొందించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆస్ట్రేలియా దేశస్థురాలు రాబిన్ జెపరి తెలిపారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని ఆస్ట్రేలియాలో సాఫ్ట్వేర్ ఉద్యోగాలు చేస్తున్న హైదరాబాద్ వాస్తవ్యులు సంక్రాంతి సెలవుల సందర్భంగా తమ కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు వచ్చిన సందర్భంలో ఆస్ట్రేలియాకు చెందిన రాబిన్ జెపరి వారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలోని పలు దర్శనీయ ప్రాంతాలను తిలకిస్తూ భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఇక్కడ ఉన్న ట్రైబల్ మ్యూజియం గురించి తెలుసుకుని మ్యూజియాన్ని సందర్శించారు. మ్యూజియంలో పొందుపరిచిన గిరిజనుల జీవన విధానాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, పాతకాలపు పనిముట్లు, కళాఖండాలను ఆసక్తిగా తిలకించిన వారు ఇవన్నీ ఎంతో అద్భుతంగా ఏర్పాటు చేశారని ప్రశంసించారు. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను నేటి యువతకు, చిన్నారులకు తెలియజేసేలా కళాఖండాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అలాగే ప్రతి కళాఖండానికి సంబంధించిన చరిత్రను సులభంగా అర్థమయ్యేలా వివరిస్తూ ప్రదర్శించడం వల్ల సందర్శకులకు సంపూర్ణ అవగాహన కలుగుతోందని, మ్యూజియం నిర్వాహకులు ప్రతి అంశాన్ని స్పష్టంగా వివరించడం చాలా బాగుందని తెలిపారు. గిరిజన మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్లు ఎంతో రుచికరంగా ఉన్నాయని ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాబిన్ జెపరి మాట్లాడుతూ ఈ మ్యూజియం గిరిజన ప్రజల జీవితాలపై అద్భుతమైన అవగాహనను కలిగిస్తుందని, మ్యూజియాన్ని ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. ఈ గొప్ప అనుభవాన్ని పొందేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం నిర్వాహకులు వీరాస్వామి, మాధవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కొత్తమాలపల్లిలో ముత్యాలమ్మ గుడి సమీపంలో మంచినీటి బోరు ఏర్పాటు

♦ హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు చొరవతో తాగునీటి సౌకర్యం



**అన్నపురెడ్డిపల్లి, జనవరి 13 ప్రజాజ్యోతి** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల కొత్తమాలపల్లి గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు చొరవతో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. కొత్తమాలపల్లి కాలనీ ప్రజలతో పాటు గ్రామంలోని ముత్యాలమ్మ గుడికి కూడా ఉపయోగపడేలా ముత్యాలమ్మ గుడి సమీపంలో ఈ బోరు ఏర్పాటు చేయడం విశేషం. సోమవారం బోరు తవ్వకాలు పూర్తి చేయగా, మంగళవారం మోటర్ ఏర్పాటు చేసి నీటి సరఫరా ప్రారంభించారు. దీంతో కాలనీ వాసులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యకు గణనీయమైన ఊరట లభించిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉపసర్పంచ్ మారగాని అశోక్‌తో పాటు గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## మండల దశాబ్ది ఉత్సవాల్లో విద్యార్థుల ప్రతిభకు వెలుగు

♦ * మండల దశాబ్ది ఉత్సవాల్లో వ్యాసరచన, వక్తృత్వ, భక్తి పాటల పోటీల సందడి

♦ * పిల్లల విజేతలకు బహుమతులు జనవరి 16న అంకమ్మ తల్లి ఆలయంలో అందజేయబడతాయి





**అన్నపురెడ్డిపల్లి, జనవరి 13, ప్రజాజ్యోతి;** అన్నపురెడ్డిపల్లి మండల దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మారగాని శ్రీనివాసరావు, శ్రీ అంకమ్మ తల్లి ఆలయ కమిటీ, ఎమ్మెస్సార్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం అంకమ్మ తల్లి గుడి ప్రాంగణంలో వివిధ విద్యార్థుల పోటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి వ్యాస రచన పోటీలు, వక్తృత్వ పోటీలు, భక్తి పాటల పోటీలు నిర్వహించగా 60 నుంచి 100 మంది వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లల ప్రతి విభాగంలో ప్రత్యేకంగా గుర్తించి, న్యాయ నిర్ణయితలుగా పరసా వెంకటేశ్వరావు, సంపత్ మరియు చల్లా భాస్కర్ జడ్జీలుగా ఆ విజేతలను నిర్ణయించారు. ఈ విజేతలకు బహుమతులు జనవరి 16న అంకమ్మ తల్లి ఆలయంలో అందజేయబడతాయి. ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చూసి, పాల్గొన్న విద్యార్థులకు భోజనాలతో సహా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేలా ఈ కార్యక్రమాలు ఉపయోగపడ్డాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా సాగగా, పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## మేదర్ బజార్‌లో పండుగ శోభను చాటిన ముగ్గుల పోటీలు



**భద్రాచలం,జనవరి 13,ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలోని నాలుగో వార్డు మేదర్ బజార్ ప్రాంతంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రేపాక సాయి అఖిల్ మరియు త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులతో పండుగ శోభను సంతరించాయి. ఈ ముగ్గుల పోటీ కార్యక్రమంలో మహిళలు తమ సృజనాత్మకతను ప్రతిబింబిస్తూ సాంప్రదాయ రూపకల్పనలతో ఆకట్టుకున్నారు. పోటీల్లో విజయం సాధించిన మహిళలకు భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ, పట్టణ ఎస్సై స్వప్న, నాలుగో వార్డు సభ్యులు బండారు శరత్ హాజరై విజేతలను అభినందించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన రేపాక సాయి అఖిల్, సందీప్ మరియు త్రిశూల్ యూత్ సభ్యులను ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు సంప్రదాయాలను కాపాడడంతో పాటు యువతలో సృజనాత్మకతను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు.

## మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ..

♦ దాడిలో ఇద్దరు యువకులకు గాయాలు

**టేకులపల్లి,జనవరి13,ప్రజాజ్యోతి :** టేకులపల్లిలో మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ మంగళవారం చోటుచేసుకుంది. పల్లవి వైన్స్ లో మద్యం సేవించడానికి వచ్చిన బస్టాండ్ సెంటర్ కు చెందిన ఇద్దరు యువకులు, ఎ కాలనీ తండకి చెందిన యువకులు సుమారు 10.30 గంటల రాత్రికి గొడవ జరిగింది. బస్టాండ్ సెంటర్ యువకులపై, ఎ కాలనీ తండ యువకులు దాడికి పాల్పడ్డారు. బస్టాండ్ సెంటర్ ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి మెరుగైన వైద్యానికి తరలించారు. పూర్తి వివరాలు తెలవాల్సి ఉంది.

## అంజన్నకు అభిషేకం....రామయ్యకు కల్యాణం



**భద్రాచలం, జనవరి 13,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఉన్న దాసాంజనేయస్వామి వారికి మంగళవారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా తమలపాకులతో ప్రత్యేక అభిషేకం జరిగింది. అలాగే శ్రీ సీతారామచంద్రస్వామి వారికి నిత్యకల్యాణం నేత్రపర్వంగా సాగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు.

## వైద్య ఆరోగ్య శాఖలో సుజాతనగర్ బిడ్డ

■ గ్రేడ్ 2 ఉద్యోగానికి ఎంపిక అయినా కత్తి వెంకటేష్

■ రాష్ట్ర స్థాయి లో 774 వ ర్యాంక్



**సుజాత నగర్ జనవరి 13 ( ప్రజాజ్యోతి ):** సుజాతనగర్ మండలంలో ల్యాబ్ టెక్నీషియన్ గా వర్క్ చేస్తూ, గవర్నమెంట్ హాస్పిటల్ లో కాంటాక్ట్ వర్క్ చేస్తూ అందరి మన్ననలు పొందిన కత్తి వెంకటేష్ జనవరి 13వ తారీకు జరిగిన రాష్ట్ర స్థాయి గ్రేడ్ 2 లో 774 ర్యాంక్ సాధించారు. తను చిన్నప్పటి కల నెరవేరు అయిందని ప్రజాజ్యోతి వాళ్ళకి తెలియజేశారు. వైద్య ఆరోగ్యశాఖలో గ్రేడ్ 2 ల్యాబ్ టెక్నీషియన్లకి ఎంపికైన వారికి మంత్రి దామోదర్ రాజనరసింహ ఉస్మానియా వైద్య కళాశాల మైదానంలో మంగళవారం నియామక పత్రాలు అందజేశారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు... మంత్రి తుమ్మల



**దమ్మపేట, జనవరి. 13, (ప్రజా జ్యోతి) :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు ఘన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండుగతో ప్రారంభమయ్యే ఉత్సవాలను ప్రతి కుటుంబం ఆనందంగా, భక్తితో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. భోగభాగ్యాలు వెల్లివిరియాలని, సూర్యుని వెలుగులా ఆరోగ్యం నిలవాలని, కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఐక్యత, సంపూర్ణ ఆనందం ఉండాలని ఆయన ప్రత్యేకంగా తెలిపారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలి. పండుగలు కేవలం ఉత్సవాలే కాదు, మన సంస్కృతి, మన బంధాల గుర్తింపులు. అందరూ కలసి సంప్రదాయాలను కొనసాగిస్తూ సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవాలి అని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

## మందలపల్లి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ లకు ఘన సన్మానం



**దమ్మపేట,జనవరి. 13,(ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో విజయం సాధించిన ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ, గృహనిర్మాణ,సమాచార శాఖల మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేటలోని శ్రీ శ్రీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో భాగంగా దమ్మపేట మండలం, మందలపల్లి గ్రామ సర్పంచ్ గుజ్జల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చింతలపాటి మురళిలను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన వస్త్రాలను బహుకరించి మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో మందలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పర్వతనేని వరప్రసాద్, కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన వార్డు సభ్యులు నవ్య, మాణికల సుబ్బారావు సహా పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల విశ్వాసంతో ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ముందుండి పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో బలోపేతం కావడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు.<

## ఎస్సీ సర్టిఫికెట్ ను క్రైస్తవులు వినియోగించడంపై ఫిర్యాదు

**ఇల్లందు, జనవరి 13, ప్రజాజ్యోతి:** క్రైస్తవ పాస్టర్లయిన మోత్కూరి నరసింహారావు, మోత్కూరి కుమార్ లు ఎస్సీ సర్టిఫికెట్ ను అక్రమంగా వినియోగించుకొంటున్నారని ఇల్లందు నయాబ్ తహసిల్దార్ కు మంగళవారం మోత్కూరి సురేష్ అనే ఆటో డ్రైవర్ ఫిర్యాదు చేశారు. ఇల్లందు పట్టణంలోని, సివిలైన్ చెందిన ఆటో డ్రైవర్ మోత్కూరి సురేష్ సొంత అన్నదమ్ములైన మోత్కూరి కుమార్, మోత్కూరి నరసింహారావు లు హిందూమతంలో ఉన్నామని నమ్మబలికి ప్రభుత్వాన్ని, అధికారులను మోసం చేసి ఎస్సీ కులం సర్టిఫికెట్ తీసుకొని ప్రభుత్వ లబ్ధి పథకాలను పొందుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలోని నాయబ్ తహ సిల్దార్ కిషోర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తక్షణమే మోత్కూరు నరసింహారావు, మోత్కూరి కుమార్ ల ఎస్సీ సర్టిఫికెట్లు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు సూపరిండెంట్, కొత్తగూడెం ఆర్డీవో కు ఫిర్యాదులు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని బయట పెట్టిన తనకు ఆ ఇద్దరి వ్యక్తులతో ప్రాణభయం ఉందని, తనకు ఏమైనా జరిగితే వారే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.



# డూ.. డూ.... బసవన్నా!!

**డూ.. డూ.. బసవన్నా.. ఇటు రారా బసవన్నా.. అమ్మ గారికి దండం పెట్టు... అయ్య గారికి దండం బెట్టు.. మనుసుబు గారికి దండం పెట్టు... రారా బసవన్నా.. రారా బసవన్నా.. అంటూ.. గంగిరెద్దులాట మన సంస్కృతిలో ఓ భాగం.. సంక్రాంతి వచ్చిందంటే చాలు.. గంగిరెద్దులాటలతో పల్లెలన్నీ సందడిగా మారుతాయి. గంగిరెద్దుల సందడి.. డూ డూ బసవన్నా విన్యాసాలతో గ్రామాలు సందడిగా మారుతున్నాయి. నేడు సరదా సరదా పాటలతో గంగిరెద్దులను ఆడించి ప్రజలను సంతోషపెట్టే మేళగాళ్ళు కనుమరుగవుతున్నారు.ఒకప్పుడు దేదీప్యమానంగా వెలిగిన ఈ సాంప్రదాయం. ప్రస్తుతం అరుదుగా దర్శనమిస్తుంది. గంగిరెద్దులను ఆడించే కుటుంబాలు ఇతర ఉపాధిని వెతుక్కోవడంతో క్రమంగా ఈ సాంప్రదాయం కనుమరుగవుతుంది. వాస్తవానికి గంగిరెద్దులాట అనేది ఒక జానపద కళారూపం. ఇది ప్రాచీనమైనది. కానీ గంగిరెద్దుల జీవితాలు చీకటి మాయమయ్యాయి. అయితే పట్టణీకరణ గంగిరెద్దుల విన్యాసాల మీద కూడా కత్తి కట్టినట్లే అనిపిస్తుంది. పట్టణాలతో పాటు, పల్లెల్లో కూడా పెరుగుతున్న పట్టణీకరణాలతో గంగిరెద్దుల విన్యాసాలు మాయమవుతున్నాయి. కనుమరుగవుతున్న సాంప్రదాయాలపై ప్రజాజ్యోతి కథనం కథనం..**

- -కానరాని అలనాటి సంస్కృతి
- -కనుమరుగవుతున్న గంగిరెద్దుల సంప్రదాయం
- -అరుదుగా కనిపిస్తున్న గంగిరెద్దుల విన్యాసాలు
- -ఆదరణ లేక వలస పోతున్న కళాకారులు
- -పెరుగుతున్న పట్టణ సంస్కృతి

**ఇల్లందు, జనవరి 13, ప్రజాజ్యోతి:** భారతీయ జీవన విధానంలో పశుసంపదకు ఎంతో ప్రాముఖ్యం ఉన్నది. ఆవును గోమాతగా భావిస్తే.. ఎద్దును సందేశ్వరుడిగా పూజలు అందుకుంటున్నది. ఆ పాడి పశువులే ప్రధాన పాత్రధారులయ్యే జానపద కళా రూపం గంగిరెద్దులాట. మన సంస్కృతిలోనూ భాగమైంది. పూర్వకాలం నుంచి మనుగడలో ఉన్న ఈ కళ..పల్లె వాసులతో పాటు పట్టణ వాసులనూ అలరిస్తుంది. తెలుగు వారి పండుగలలో సంక్రాంతి పండుగకు ప్రాధాన్యత ఉంది. సాంప్రదాయం, సంస్కృతికి అద్దం పట్టే పండుగ సంక్రాంతి. ఆరుకాలం శ్రమించి పండించిన



పంటలు చేతికందే సమయంలో ఈ పండుగ రావడంతో గ్రామీణ ప్రాంతంల్లోని రైతుల కళ్ళల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. గంగిరెద్దుల విన్యాసాలు సంక్రాంతికే ప్రత్యేకమని చెప్పొచ్చు. అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు..అంటూ చెప్పే యజమాని సూచనలకు అనుగుణంగా తల ఊపే బసవన్నలు కొత్త వస్త్రాల అలంకరణలో ఆకట్టుకుంటాయి. ఈ సాంప్రదాయం ప్రస్తుతం చాలా అరుదుగా దర్శనమిస్తోంది. వ్యవసాయానికి దన్నుగా ఉండే బసవన్నలు లేకపోవడమే నేడు ఈ పరిస్థితికి కారణమని రైతులు చెబుతున్నారు. పండుగ నెల వచ్చిందంటే బసవన్నలు గ్రామాల్లో తిరుగుతూ... సందడి చేయడం పరిపాటి. సంక్రాంతికి కొన్ని చోట్ల ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. గ్రామ నడిబొడ్డున ఆటలు ఆడించి ప్రజలను ఆనందింపజేసేవారు.

### ›› ఆకట్టుకునే అలంకరణ

గంగిరెద్దుల అలంకరణ ఆకట్టుకునేలా ఉంటుంది. ఉన్నంతలో ఆనందంగా తీర్చిదిద్దుతారు. బట్టలను బొంతలుగా కుట్టి వాటికి అద్దాలు పొదుగుతారు. మరింత ఆకర్షణ కోసం చెంకి దండలు జతచేసి, మూపురం నుంచి తోక వరకు కప్పుతారు. ముఖం దగ్గర రంగుల తోట కుచ్చు, మూతికి తోలుతో కుట్టిన శిఖమారు కడతారు. కాళ్లకు గజ్జలు, మెడలో గంటలు కట్టి బసవన్నను అలంకరిస్తారు. వాటిని ఆడించే కళాకారులు ప్రత్యేకంగా ముస్తాబవుతారు. నెత్తిన రంగుల తలగుడ్డ, మూతి మీద కొరమీసాలు, చెవులకు కమ్మల జోడు, పాత కోటు చేతికి వెండి మురుగులు, పంచ ధరించి ఆకర్షనీయంగా కనిపిస్తారు. సన్నాయి బూర, డోలు, చేతిలో చిన్న కంచు గంట పట్టుకొని ప్రదర్శన నిర్వహిస్తారు. ఆటతో పాటు గాత్రంలోనూ వినోదాన్ని పంచుతారు.

### ›› ఆడిస్తూ...ఆశీర్వదిస్తూ..

సంక్రాంతి పర్వదినాల్లో ఇంటింటికి తిరుగుతూ గంగిరెద్దులను ఆడిస్తారు. తమ ఇంటికొచ్చిన గంగిరెద్దును సాక్షాత్తు నందీశ్వరుడి స్వరూపంగా భావించి ఇంటి వాళ్ళు హారతి పట్టి పూజిస్తారు. డూ.. డూ.. బసవన్నా... రారా బసవన్నా.. అనగానే ఎద్దులు ముందుకు వస్తాయి. అమ్మవారికి దండం పెట్టు.. అయ్యగారికి దండం పెట్టు.. అనగానే ముందర కాలెత్తి సలాం చేస్తాయి. అయ్యగారికి శుభం కలుగుతుందా...? తలపెట్టబోయే కార్యం సఫలమవుతుందా...? అనగానే గంగిరెద్దులు తలాడించడాన్ని శుభ సూచికంగా, నందీశ్వరుడి దీవెనగా భావిస్తారు. గంగిరెద్దు వాళ్లు కూడా ఎద్దు ముందు కాళ్ళను చాతి మీద పెట్టుకొని ఆడిస్తారు. ఇంటిల్లిపాదినీ తమదైన శాలితో పొగుడుతూ.. ఆశీర్వాదాలు ఇస్తారు. ఏది ఏమైనా ప్రస్తుత సాంప్రదాయాల్లో అనుగుణంగా అడపాదడపా గంగిరెద్దులు దర్శనమియ్యడం జరుగుతుంది. రానున్న రోజుల్లో నేటితరం వారికి గంగిరెద్దుల గురించి చెప్పడమే తప్ప కనిపించడం కష్టమే....